సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 18 । డిసెంబర్ । 2024



ఏపీపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లాలో ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి యం.విశ్వేశ్వర నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. -8లో



అధికారుల తనిఖీలు

ప్రొద్దుటూరు పట్టణంలోని పలు దుకాణాల్లో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు రెండు బృందాలుగా ఏర్పాడి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/17.4

జిల్లాలో మంగళవారం 17.4 – 29.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

డీఈఓ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలోని కడప మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలు, ప్రొద్దుటూరు మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎస్జీటీ, తత్సమాన కేటగిరీ నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాను www.kadapadeo.in వెబ్‌సైట్‌నందు పొందుపరిచామని డీఈఓ మీనాక్షి తెలిపారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే 18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తగిన ఆధారాలు, సర్వీసు రిజిస్టర్‌తో స్వయంగా డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని ఆమె తెలిపారు.

విద్యార్థులకు పోటీలు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో జాతీయ వినియోగదారుల దినోత్సవం-2024ను పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను పౌరం సభ్యులు, ప్రధానోపాధ్యాయులు నిర్వహించాలని డీఈఓ మీనాక్షి తెలిపారు. ఇందులో భాగంగా 'వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణలు-డిజిటల్ సౌలభ్యం' అనే అంశం మీద తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియం విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించాలన్నారు. ఇందుకు సంబంధించి 19వ తేదీ పాఠశాల స్థాయిలో, 20న మండలస్థాయిలో నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థులు ఈ నెల 21వ తేదీన కడప డీసీఈసీ హాల్ సీఎస్ఐ హైస్కూల్ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని అన్నారు. మండలస్థాయిలో గెలుపొందిన విద్యార్థుల వివరాలను 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తెలపాలని డీఈఓ ఆదేశించారు.

నేడు 35 గ్రామాల్లో సదస్సులు

కడప సెవెన్‌రోడ్స్: భూ సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం బుధవారం జిల్లాలోని 35 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. బద్వేలు రెవెన్యూ డివిజన్‌లోని పాపన్నపల్లి, డి.లింగంపల్లి, అనంతరాజుపేట, గోపవరం, గంగాయపల్లి, మిట్టమానిపల్లి, ముసల్‌రెడ్డిపల్లి, కత్తెరగండ్ల(చెన్నంవరం)లో సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు. పులివెందుల రెవెన్యూ డివిజన్‌లోని చిలేకాంపల్లి, కామసముద్రం, పులివెందుల, చవ్వారిపల్లె, యాదవకుంట, అలవలపాడు, వేముల, ఎస్.పాలగిరి గ్రామాల్లో, , జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లో మొర్ర్యపల్లి, దాసరిపల్లి, గూడెంచెరువు, ఓబన్నపేట, ఉప్పలూరు, దొడియం, గుండ్లకుంట, కల్లూరు, వెంగలాయపల్లె, చిన్నదండ్లూరు గ్రామాల్లో, కడప రెవెన్యూ డివిజన్ లో నందిమండలం, దుగ్గనపల్లి, కొప్పర్తి, పాత కడప, నల్లింగాయపల్లి, అపనపల్లి, నేకనాపురం, చిన్నపుత్త, మంటపంపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయని డీఆర్వో వివరించారు.

మరో రెండు ప్రత్యేక రైళ్లు

కడప కోటిరెడ్డిసర్కిల్: అయ్యప్ప భక్తుల కోసం మరో రెండు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ తెలిపారు. విజయవాడ- కొల్లంల మధ్య డిసెంబర్ నెలంతా ప్రత్యేక రైలు నడుస్తుందన్నారు. 07177 నెంబర్ గల రైలు డిసెంబర్ 21, 28 తేదీల్లో శనివారం రాత్రి 10.15 గంటలకు విజయవాడలో బయలుదేరి కడపకు మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు చేరుకుని సోమవారం ఉదయం 6.20 గంటలకు కొల్లాంకు చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో (రైలు నెంబర్ 07178) డిసెంబర్ 23, 30 తేదీల్లో సోమవారం ఉదయం 10.45 గంటలకు బయలు దేరి కడపకు మరుసటి రోజు ఉదయం 5.40 గంటలకు చేరుకుని కాకినాడకు ఆరోజు రాత్రి 9 గంటలకు రైలు చేరుతుందన్నారు. అలాగే మరో రైలు నరసాపూర్ -కొల్లంల మధ్య నడుస్తుందన్నారు. 07183 నెంబర్ గల ఈ రైలు నర్సాపూర్ నుంచి జనవరి 15, 22వ తేదీల్లో బుధవారం రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం కడపకి 9.45 గంటలకు చేరుకుని శుక్రవారం ఉదయం 5.30 గంటలకు కొల్లాంకు చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో (07184) కొల్లంలో జనవరి 17, 24 తేదీల్లో శుక్రవారం ఉదయం 8.40 గంటలకు బయలుదేరి శనివారం ఉదయం 5:40 గంటలకు కడపకు చేరుతుందన్నారు.

వ్యాధి కబురు చల్లగా..



చలిగాలులు జనాల్ని కలవరపెడుతున్నాయి. సూరీడు పడమటింటికి జారకముందే మొదలయ్యి.. తెల్లారి తూరుపు కొండల్లో ఉదయించే దాకా వీర విహారమే చేస్తున్నాయి. మెల్లగా ఇంట్లోకి.. ఆపై ఒంట్లోకి చొరబడి వణికిస్తున్నాయి. జలుబుతో మొదలెట్టి.. విష జ్వరాల దాకా తీసుకెళ్తూ మనిషిని 'మంచాన'పడేస్తున్నాయి. ఆస్తమా.. గుండె సంబంధిత రోగులకు 'ఊపిరి'ఆడనీయకుండా చేస్తున్నాయి. ఇక నిమోనియాగా మారి 'ఉసురు' తీస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండడం.. విష జ్వరాలు సోకుతున్న వైనంపై కథనం.

- చలి తీవ్రతతో రోగాలు విజృంభణ
- రోగులతో కిక్కిరిసిపోతున్న ఆసుపత్రులు
- ఓపీ, ఐపీల్లో పెరుగుతున్న జ్వర పీడితులు

వేంపల్లి: జిల్లాను వైరల్ ఫీవర్లు వణికిస్తున్నాయి. రెండు నెలల నుంచి తుపాను ప్రభావంతో వర్షాలతో పాటు వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో మంచు అధికంగా కప్పేస్తోంది. ఫలితంగా రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. దీంతో చాలా మంది జలుబు, జ్వరాలతో.. శ్వాసకోశవ్యాధుల సమస్యలతో అవస్థలు పడుతున్నారు. సాధారణ జ్వరాలతోపాటు వైరల్ డెంగ్యూ, టైఫాయిడ్ కేసులు తోడవడంతో ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వేంపల్లెలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తోపాటు తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మరో 50 ప్రైవేట్ క్లినిక్‌లలో సుమారు 3వేల మంది ఓపీ చికిత్సలకు వస్తుండడం గమనార్హం. వీరిలో జ్వరాలతో బాధపడే వారి సంఖ్య అధికం. ఈ నేపథ్యంలో ఆసుపత్రుల్లో ఐపీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. బెడ్లు కొరత లేకుండా సర్దుబాటు చేయాల్సి వస్తోంది. చలికాలం తగినంత పోషకాహారం, నీరు తీసుకోకపోవడంతో రోగ నిరోధక శక్తి తగ్గి వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ ఆసుపత్రులు, ఆర్ఎంపీలు రోగుల జేబులను ఖాళీ చేస్తున్నారు.



వేంపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

గత వారంలో.. (ఉష్ణోగ్రతలు, సరాసరి)	ప్రస్తుతం..
పగలు: 32 డిగ్రీల సెల్సియస్	పగలు: 28 డిగ్రీల సెల్సియస్
రాత్రి: 25 డిగ్రీల సెల్సియస్	రాత్రి: 17 డిగ్రీల సెల్సియస్

అమ్మో... నిమోనియా..!

శీతాకాలం వచ్చిందంటే చాలు ఆస్తమా, అలర్జీ ఉన్న వారికి ఒంట్లో వణుకు పుడుతుంది. చలిగాలికి జ్వరాలతోపాటు అలర్జీ సమస్యలు తీవ్రమవుతాయి. ముఖ్యంగా చాలామంది చిన్నారులు నిమోనియా బారినపడుతున్నారు. ఈ లక్షణాలతో ఇటీవల వేంపల్లె మండలంలో ముగ్గురు మృత్యువాత పడటం ఆందోళన కలిగిస్తోంది. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నిమోనియా వ్యాధుల కేసుల తీవ్రత మరింత ఎక్కువ కనిపిస్తోంది. ఇక వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తూ జ్వర పీడితుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుండడంతో జనాలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఇంట్లోనూ జ్వర బాధితులు ఇద్దరు, ముగ్గురు కనిపిస్తున్నారు.

వైరల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కలుషిత నీరు, మాంసాహారం తీసుకున్న వారికి టైఫాయిడ్ సోకుతుంది. ఇక దోమకాటు బారిన పడిన వారిలో వైరల్, డెంగ్యూ జ్వర లక్షణాలు, రక్త కణాలు తగ్గుతాయి.
- దోమతెరలు వాడడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- రోజుకు 3నుంచి 5లీటర్ల నీరు తాగడం మంచిది.
- జ్వరం తీవ్రత తగ్గకపోతే ఓఆర్ఎస్ తీసుకోవాలి.
- ఆస్తమా, ఆయాసం ఉన్న వారు మంచులో నడవాల్సి వస్తే తగిన జాగ్రత్తలు పాటించాలి.
- పొగ తాగేవారు చలిలో వాకింగ్ చేయకపోవడమే ఉత్తమం. బీపీ, షుగర్ ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.
- ముఖ్యంగా చిన్న పిల్లల్లో చెవిపోటు, గొంతునొప్పి, జలుబు వచ్చే అవకాశం ఉన్నందున సూర్యరష్మి వచ్చిన తర్వాతే వారిని బయటకు పంపించాలి.
- వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవాలి. అందుకోసం పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. రోజూ ఉడకబెట్టిన గుడ్లు తీసుకోవడం ఉత్తమం.

ఎవరూ పట్టించుకోవడం లేదు



రెండు రోజులుగా జ్వరం విపరీతంగా వస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రికికి రాగా పెద్ద డాక్టర్లు సెలవు పెట్టారని, అసిస్టెంట్ డాక్టర్ మందుల చీటీ ఇచ్చి బెడ్డుపైన పడుకోమని చెప్పారు. ఆసుపత్రికి వచ్చి రెండు గంటలైనా ఎవరూ పట్టించుకోలేదు.

– ఓబులమ్మ,జ్వర పీడితురాలు, వేంపల్లె

మెరుగైన వైద్య సేవలకు చర్యలు

జ్వరాలతో ఆసుపత్రికి వచ్చే సంఖ్య అధికంగా కనిపిస్తోంది. వాటిని అదుపు చేసేందుకు కావాల్సిన మందులు, సరిపడా బెడ్లు అందుబాటులో ఉన్నాయి. పేదలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాం. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఎవరూ ఇబ్బందులు పడొద్దు. శీతాకాలం ముగిసే వరకు పిల్లలు, వృద్ధులు తెల్లారే సమయంలో, సాయంత్రం చీకటి పడిన తర్వాత బయట తిరగడం మంచిది కాదు. వెచ్చని దుస్తులు ధరించాలి.

– శేఖర్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్, వేంపల్లె

జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది



పీహెచ్‌సీల్లోనూ మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాం. సీజనల్ వ్యాధుల దృష్ట్యా జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. వైరల్ ఫీవర్లతోపాటు టైఫాయిడ్ కేసులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి. పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. జ్వరమని తెలియగానే సమీప ఆసుపత్రులలో సత్వరం చికిత్స చేయించుకోవాలి.

– స్వాతిసాయి, పీహెచ్‌సీ వైద్యురాలు, తాళ్లపల్లె

పరీక్షా ఫలితాలు విడుదల

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) 3వ, 5వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీంబాషా మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ సెమిస్టర్‌లో 79.4 శాతం ఫలితాలు, 5వ సెమిస్టర్‌లో 91.4 శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల విభాగం అధికారులు రాఘవేంద్ర, డా. సుబ్రమణ్యం, హరిత, నాగమునిరెడ్డి, గురుమోహన్‌రెడ్డి, ఎం.వి.రమణ, శచీదేవి పాల్గొన్నారు.

వైవీయూలో అకడమిక్ ఆడిట్



వైవీయూలో విభాగాలను పరిశీలిస్తున్న ఐఎస్ఓ ప్రతినిధులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్(ఐఎస్ఓ) ప్రతినిధుల బృందం సందర్శించింది. తొలుత ప్రతినిధుల బృందం హెచ్.వై.ఎం. ఇంటర్నేషనల్ సీఈఓ ఆలపాటి శివయ్య, ఆడిటర్ టి.సుమాదేవి విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డిని కలిశారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఐక్యూఏసీ సంచాలకులు డా. ఎల్. సుబ్రహ్మణ్యం శర్మ, డిప్యూటీ డైరెక్టర్ ఎం. సుభోష్ చంద్ర, గ్రీన్ అండ్ ఎనర్జీ సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని హ్యూమానిటీస్ బ్లాక్, సైన్స్ బ్లాక్, గురుకులం భవనాలలోని డిపార్ట్‌మెంట్లను పరిశీలించారు. శాఖలలో జరుగుతున్న ప్రగతిని ప్రత్యక్షంగా గమనించారు. బుధవారం కూడా పరిశీలన ఉంటుందని ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ తెలిపారు. ఈ సందర్భంగా వీసీ కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ హెచ్.వై.ఎం. ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రతిష్టాత్మక మైందని, అత్యున్నతస్థాయి విశ్వవిద్యాలయానికి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జిల్లాను ప్రగతి పథంలో నడిపిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

- ఆర్థిక ప్రగతికి బ్యాంకర్ల సహకారం అవసరం
- డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: సమాజ ఆర్థికాభివృద్ధితోపాటు జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతైనా అవసరమని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్‌సీ) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై ఆయా బ్యాంకుల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణాలు అందించడంలో సెప్టెంబర్ మాసాంతానికిగాను జిల్లా పురోగమనంలో కొనసాగు తున్నందుకు బ్యాంకర్లను అభినందించారు. జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలోని అన్ని స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి జిల్లా ఆర్థిక అభివృద్ధిలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలన, మహిళా అభివద్ధి, సాధికారిత, పొదుపు సంఘాల బలోపేతంతోనే సాధ్యం అవుతుందని వివరించారు. 'వైఎస్సార్ విజన్ యాక్షన్ ప్లాన్ 2024-29'ప్రకారం జిల్లాను ఆర్థికంగా అభివద్ధి పథంలో నడిపించేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రంగాల అభివృద్ధికి అపారమైన వనరులు ఉన్న ఆకాంక్ష జిల్లాను గ్లోబల్ ఎకానమీలో కీలక స్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రతి గ్రామంలో ప్రతి ఎస్‌హెచ్‌జీ నుంచి కనీసం ఒక్క మహిళా కుటుంబం ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. అర్హులైన యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూర్చేలా రుణ సదుపాయాలు కల్పించాలని సూచించారు. అంతకుముందు జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్ధనం డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశానికి సంబంధించిన అజెండా, వివరాలను, పలు శాఖల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రుణాల ప్రగతిని ఆయా శాఖల అధికారులు కలెక్టర్ కి వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను 2024 సెప్టెంబర్ 30వ తేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.17,939 కోట్లకు గాను రూ.12,309 కోట్ల మేర రుణాలు మంజూరు చేసి 68.61 శాతం ఆర్థిక ప్రగతిని సాధించిందని వెల్లడించారు. ఈ సమావేశంలో నాబార్డు ఏజీఎం విజయ విహారి, రిజర్వ్ బ్యాంక్ ఎల్డిఓ నవీన్ కుమార్, కెనరా బ్యాంకు ఏజీఎం మురళీ మోహన్, ఎస్‌బీఐ ఎజీఎం వాణీ కిషోర్ కుమార్ రెడ్డి, యూబీఐ ఏజీఎం లక్ష్మీ తులసి, ఏపీజీబీ ఏజీఎం శ్రీనివాస ప్రసాద్, కేడీసీసీ సీఈఓ రాజమ్మ, డీఆర్డీఏ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, సురేష్ రెడ్డి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, జీఎం చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు

ఒంటిమిట్ట రామయ్య హుండీ ఆదాయం లెక్కింపు


ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయం హుండీ ఆదాయం మంగళవారం టీటీడీ అధికారులు లెక్కించారు. లెక్కింపు మొత్తం పూర్తయ్యేసరికి స్వామివారి హుండీ ఆదాయం 7 లక్షల, 7 వేల, 990 రూపాయలు వచ్చినట్లు ఆలయ టీటీడీ అధికారులు వెల్లడించారు.

నీళ్లు నములుతున్నారు!

- రైళ్లకు నందలూరులో నీటి సౌకర్యం కల్పించే ప్రతిపాదన పెండింగ్‌లోనే..
- అప్పట్లో రూ.34 లక్షలకుపైగా వ్యయంతో అంచనాలు
- నందలూరు నీళ్ల ప్రాముఖ్యతను విస్మరిస్తున్న రైల్వే శాఖ
- రైల్వే అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



రైళ్లకు వాటరింగ్ (నమూనా చిత్రం)



నందలూరు రైల్వే కేంద్రం

రాజంపేట: గుత్తి-రేణిగుంట రైలుమార్గంలోని వివిధ రైళ్లకు నందలూరు స్టేషన్‌లో నీటి సౌకర్యం కల్పించాలనే ప్రతిపాదన పట్టాలెక్కలేదు. రైళ్లకు నందలూరులో నీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన పనులకు రూ.34లక్షలకుపైగా వ్యయం అవుతుందని అంచనాలను రూపొందించినట్లు రైల్వే వర్గాల ద్వారా తెలిసింది. అయితే కరోనా మహమ్మారి నేపథ్యంలో అప్పట్లో ఈ ప్రతిపాదనను రైల్వే శాఖ అటకెక్కించింది. కరోనా మహమ్మారి ప్రభావం ముగిసి ఐదేళ్లయినా ఈ ప్రతిపాదనను అమలు చేయాలన్న దిశగా రైల్వే ఉన్నతాధికారులు ఆలోచించడం లేదు. అక్టోబరు 4న విజయవాడలో జరిగిన రైల్వే అధికారుల సమావేశంలో రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిలు నందలూరురైల్వేకు పూర్వవైభవం కల్పించే అంశాలను ప్రస్తావించారు.

నందలూరు నీళ్ల ప్రాముఖ్యత..

దక్షిణ మధ్య రైల్వేలో గుంతకల్లు డివిజన్‌లో నందలూరు నీళ్లకున్న ప్రాముఖ్యత అందరికీ తెలిసిందే. ఇటీవల ఇదే అంశంపై ఢిల్లీలో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్‌ను నందలూరు ఐకేపీఎస్ నేతలు కలిసిన సందర్భంలో ఆయన కూడా నందలూరు నీళ్ల ప్రాముఖ్యతను గుర్తు చేశారు. నందలూరు నీటితోనే రైల్వే పుట్టుక ఆరంభమైంది. 1864లో బ్రిటీషర్లు నందలూరులో నీటి లభ్యతను ఆధారం చేసుకొని స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ నిర్మించారు. ఈ నీటి వల్ల నీటి ఆవిరికి సంబంధించిన పింగాణి తుప్పు పట్టకుండా ఉంటుందని అప్పట్లోనే బ్రిటీషు రైల్వే పాలకులు నీటి నాణ్యతపై పరిశోధనలు చేశారు. రైల్వేకేంద్రానికి అవసరమైన నీటి కోసం యేటి నొడ్డున బావిని తవ్వించారు.

పూ్యరిఫైడ్ నీళ్లుగా గుర్తింపు

తెల్లదొరలు నందలూరు నీటిని ప్యూరిఫైడ్ నీటిగా గుర్తించారు. అందువల్లనే వారు నందలూరుకు రైల్వేపరంగా ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. నందలూరు నీటిలో పొటాషియం, కాల్షియంతోపాటు ఖనిజ లవణాలు పుష్కలంగా ఉన్నాయి. టీడీఎస్ 188 పాయింట్లు చూపిస్తోంది. అదే కంపెనీ వాటర్ బాటిళ్లలో 25 నుంచి 35 పాయింట్లు చూపిస్తోంది. అంటే మినరల్ వాటర్ కూడా నందలూరు నీళ్లకన్నా నాణ్యతలో తక్కువేనని పేర్కొంటున్నారు.

నీటి కోసం 'తిరుమల' పరుగులు..

విశాఖ –తిరుపతి మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు నీటి కోసం కడప నుంచి కొండాపురం వరకు పరుగులు తీయకతప్పడంలేదు. ఫలితంగా రైల్వే వ్యయం వృథా అవుతోంది. అనవసర ఖర్చులు, భారం రైల్వేపై పడుతోందని రైల్వే వర్గాలు అంటున్నాయి. కేవలం రైల్వే అధికారులు తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల పరోక్షంగా నష్టం కలుగుతోందన్న విమర్శలు రైల్వేవర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఈ మార్గంలో నడిచే రైళ్లకు నీళ్లు పట్టుకునేందుకు నందలూరు అనుకూలమని ఇప్పటి డివిజన్ ఉన్నతాధికారులకు తెలుసు. కడప నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న నందలూరులో తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు వాటరింగ్, క్లీనింగ్ పెట్టుకోకుండా కడప నుంచి 90 కిలోమీటర్ల దూరంలోని కొండాపురం తీసుకెళ్లి, మళ్లీ కడపకు తీసుకొచ్చి నడిపించడం చూస్తుంటే విడ్డూరంగా ఉందని కార్మిక సంఘాలు పెదవి విరుస్తున్నాయి.

నందలూరు నుంచే వాటర్ ట్యాంకర్ రైళ్లు నడిచాయి..

స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ కొనసాగిన సమయంలో నందలూరు నుంచే వాటర్ ట్యాంకర్ రైళ్లు నడిచాయి. గుంతకల్ డివిజన్ ఉన్నతాధికారులు ప్యాసింజర్ రైళ్ల బ్రేక్‌లలో నీటి క్యాన్‌లతో సరఫరా జరిగేది. 1977లో గుంతకల్లు డివిజన్ సదరన్ రైల్వే నుంచి విడిపోయి దక్షిణ మధ్య రైల్వేలో విలీనం అయినప్పటికీ ఇతర రాష్ట్రాలకు చెందిన అనేక మంది ఉద్యోగులు ఇక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారంటే నీళ్లే కారణంగా చెబుతున్నారు.



ఆకలి కేకలు

అరకొర జీతాలతోనే బతుకుబండి లాగించే చిరు జీవులపై అధికారులు కర్కశంగా వ్యవహరిస్తున్నారు. నెలనెలా జీతాలివ్వకుండా వారి జీవితాలతో ఆడుకుంటున్నారు. కడప కార్పొరేషన్‌లో అధికారుల నిర్లక్ష్యం కార్మికుల కుటుంబాలకు శాపంగా మారుతోంది. ఒళ్లొంచి పనులు చేస్తూ కూడా జీతాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో ఇదిగో ఇలా ఆఫీసుల ఎదుట అర్ధనగ్న ప్రదర్శనలు చేస్తున్నారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న వీరికి ఒకటి రెండు కాదు మూన్నెళ్లుగా జీతాలు రాలేదు. 'పండుగలు వస్తున్నాయి.. పస్తులుంచకుండా చూడండి సారూ'అంటూ కమిషనర్‌ను వేడుకుంటున్నారు. మరి కమిషనర్ వీరి సమస్యను తెలుసుకుని పరిష్కరించి కనికరిస్తారో... శీతకన్నేస్తారో చూడాలి. – కడప కార్పొరేషన్

ఆవిరైన ఆశలు..

ఆఫీసుల చుట్టూ తిరిగి అర్జీలు ఇచ్చింది లేదు... ఎవరి సిఫార్సుల కోసం అర్రులు చాచింది లేదు. అర్హులందరికీ 'ఇంటి పట్టా' చేతికొచ్చి వాలిందా రోజు. అంతే.. సంతోషంతో ఇళ్ల నిర్మాణంలో మునిగిపోయారు పేదలు... ఇంకొన్ని రోజుల్లో పనులు పూర్తయి సొంతింటి కల సాకారమవుతుందన్న కలలుగన్నారు. 'కోడ్' కూయడంతో బిల్లులు ఆగిపోయాయి. పనులు నిలిచిపోయాయి. ఆపై వచ్చిన 'కూటమి' ప్రభుత్వం ఎప్పట్లానే పేదలపై కక్షగట్టింది. సంక్షేమాన్ని అటకెక్కించింది. అభివృద్ధి మాటే మరిచింది. ముఖ్యంగా జగనన్న కాలనీల్లో అభివృద్ధి పరచాల్సిన 'దారు'ల్లో ఆటంకాలు కలిగిస్తోంది. ఫలితంగా పేదల ఆశల చుట్టూ ఇలా ముళ్లపొదలు కమ్ముకుంటున్నాయి. కడప నగర శివార్లలోని వైఎస్సార్ కాలనీ సమీపంలోని జగనన్న కాలనీలో దృశ్యాలివి.

– ఫొటోలు.. సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప





క్లుప్తంగా

రెండు బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లాలో రెండు బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని కడప మున్సిపల్ కార్పొరేషన్, ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలో రెండు బార్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. అదే విధంగా జిల్లాలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం దరఖాస్తుదారులు ఈనెల 31 లోపు ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. ఈ ప్రీమియం స్టోర్ ఐదేళ్లు కాగా లైసెన్స్ ఫీజు ఏడాదికి రూ.కోటి, రెండో ఏడాది నుంచి 10 శాతం ఫీజు పెంచుతామని వివరించారు.

ఎంపీ పీఏ విచారణకు హాజరు

పులివెందుల రూరల్ : పులివెందులలోని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డిని పోలీసులు విచారణ నిమిత్తం పిలిపించారు. ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడంతో.. రాఘవరెడ్డిని పిలిపించామని సీఐ నరసింహులు తెలిపారు. విచారణలో భాగంగా రాఘవరెడ్డిని పిలిపించామే తప్ప మరేమీ లేదని సీఐ తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రావడంతో పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు.

వెండి నాగ ప్రతిమ చోరీ



కొండాపురం : మండల పరిధి పెంజిఅనంతపురం గ్రామ సమీపంలోని నీలమల్లేశ్వర కోనలో సోమవారం కొందరు శివ భక్తులు మాల వేసుకున్నారు. అక్కడికి వచ్చిన వారిలో గుర్తు తెలియని వ్యక్తులు నాగపడిగ ప్రతిమను పట్టపగలే చోరీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు కిలోల వెండితో చేసిన నాగపడిగ ప్రతిమ సుమారు రెండు లక్షల విలువ ఉంటుందని భక్తులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

బి.కొత్తకోట : మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ గుడ్లవారిపల్లెకు చెందిన విజయనిర్మల (34) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సీఐ జీవన్ గంగనాథ్ బాబు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుడ్లవారిపల్లెకు చెందిన జనార్దన్ భార్య విజయనిర్మల సోమవారం రాత్రి ఇంటిలో నిద్రిస్తున్నారు. రాత్రి వేళ నిద్రలేచి చూడగా.. అపస్మారక స్థితిలో ఉండటం గమనించి కుటుంబీకులు మంగళవారం తెల్లవారుజామున మూడు గంటలకు బి.కొత్తకోట సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు విజయనిర్మల అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతిపై అనుమానాలు వ్యక్తం కావడంతో విజయనిర్మల తమ్ముడు హరీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యనా, ఆత్మహత్యనా తేల్చేందుకు వారు దర్యాప్తు చేపట్టారు.

చెలరేగిన చైన్‌స్నాచర్స్

- ఒకే రోజు రెండు చోట్ల యత్నం
- స్థానికులు అడ్డుకోవడంతో విఫలం





బోయనపల్లెలో చైన్‌స్నాచర్ సీసీటీవీ ఫుటేజీ



మహిళ బంగారు గొలుసు

రాజంపేట : రాజంపేటలో చైన్‌స్నాచర్స్ చెలరేగిపోయారు. పట్టణంలోని పలు దారుల్లో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లే మహిళలనే టార్గెట్ చేసుకున్నారు. మంగళవారం ఆర్‌ఎస్ రోడ్డులోని ఓ ప్రైవేట్‌చిట్స్ కంపెనీలో పని చేస్తున్న మహిళ నూనివారిపల్లె నుంచి తన కార్యాలయానికి నడుచుకుంటూ వెళ్తుండగా.. రాఘవేంద్రస్టోర్ వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని 4 తులాల బంగారు గొలుసు లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. ఆమె గొలుసును గట్టిగా పట్టుకున్నారు. తెగి మెడకు గాయమైంది. దీంతో ఆ ప్రాంత మహిళలు చైన్‌స్నాచర్స్ గతంలో ఓమారు రెచ్చిపోయిన సంఘటనలు గుర్తుచేసుకున్నారు. పట్టణపగలే రోడ్లపై మహిళలు తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. అలాగే బోయనపల్లె (రాజంపేట రూరల్ ఏరియా)లో కూడా చైన్‌స్నానర్స్ హల్‌చల్ చేశారు. పలువురు మహిళల గొలుసులు అపహరించేందుకు యత్నం చేశారు. స్థానికులు పట్టుకునేందుకు ప్రయత్నిం చేయడంతో వారు పరారయ్యారు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని సమాచారం.

నిర్మానుష్య ప్రాంతాలపై దృష్టి

పట్టణంలో రద్దీగా లేకుండా ఉండి, నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలపై చైన్‌స్నాచర్స్ దృష్టి పెడుతున్నారు. ఆ ప్రాంతంలో ఒంటరిగా వెళ్లే మహిళలను కొంత దూరం అనుసరించడం, అదనుచూసి బంగారు గొలుసులు లాక్కెళ్లడం జరుగుతోంది. గతంలో నూనివారిపల్లె, ఆర్‌ఎస్‌రోడ్డుతోపాటు మహిళలు అధికంగా వచ్చే మార్కెట్ ఏరియా, బంగారు దుకాణాలు ఉండే బండ్రాళ్ల వీధి తదితర ప్రాంతాల్లో రెక్కీ నిర్వహిస్తుంటారు. మహిళలు అప్రమత్తంగా ఉండకపోతే.. మెడలోని బంగారుగొలుసులు కోల్పోవాల్సి వస్తుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

హత్యా.. ఆత్మహత్యా?

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సురేష్ మృతదేహం

కొండాపురం : మండల పరిధి లావనూరు–చెన్నమనేనిపల్లె గ్రామాలకు వెళ్లే రోడ్డులోని ఓ కల్వర్టు వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. హత్యా.. ఆత్మహత్యా.. అనే విషయం పోలీసులు తేల్చాల్సి ఉంది. స్థానికులు, బంధువులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరు గ్రామానికి చెందిన చిన్నగుల్లి ఓబన్నగారి బాలయ్య పెద్దకుమారుడు చిన్నగుల్లి ఓబన్నగారి సురేష్(36) మంగవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనకు చిలమకూరు గ్రామానికి చెందిన వీరకుమారితో 10 ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరకుమారి ఆశా వర్కర్‌గా పని చేస్తోంది. వీరికి ఇద్దరు సంతానం. సురేష్ ఆటో నడుపుకొంటూ ఎల్లనూరులోనే నివాసం ఉంటున్నారు. సురేష్, వీరకుమారికి మనస్పర్థలు ఉన్నాయి. ఏడాది నుంచి వారు దూరంగా ఉంటున్నారు. కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ సురేష్ మృతదేహం వద్దకు చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వాగ్వాదం

షర్మిల జన్మదిన వేడుకల్లో డీసీసీ, నగర అధ్యక్షుల మధ్య వివాదం



పార్టీ కార్యాలయం నుంచి వెళ్లిపోతున్న డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప వైఎస్సార్ సర్కిల్ : కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి, నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ మధ్య మంగళవారం వాగ్వాదం చోటుచేసుకుంది. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల జన్మదినం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసేందుకు అఫ్జల్‌ఖాన్ ఏర్పాట్లు చేశారు. అప్పటికే నగరంలోని అశోక్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కో–ఆర్డినేటర్ బండి జకరయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి దుప్పట్లు పంపిణీ చేశారు. ఆ కార్యక్రమాలు ముగించుకొని పార్టీ కార్యాలయానికి చేరుకోగానే.. నగర అధ్యక్షుడు కేక్ కట్ చేసేందుకు పిలిచారు. తనకు ముందస్తు సమాచారం లేకుండా.. ఎలా కేక్ కట్ చేస్తానంటూ విజయజ్యోతి మండి పడ్డారు. డీసీసీ అధ్యక్షురాలు మహిళ అని కూడా చూడకుండా, గౌరవంగా పిలవకపోవడం ఏమిటని వాగ్వాదానికి దిగారు. అక్కడ వివాదం నెలకొనడంతో ఆమె వెళ్లిపోయారు. ఈ విషయంపై డీసీసీ అధ్యక్షురాలు మాట్లాడుతూ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్‌కు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంతో సంబంధం లేదని అన్నారు. తనకు సమాచారం పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి వస్తుందన్నారు. నగర అధ్యక్షుడి తీరుపై అధిష్టానికి ఫిర్యాదు చేస్తామన్నారు. తనకు, పార్టీ కార్యాలయానికి సంబంధం ఉందో లేదో అధిష్టానం తేలుస్తుందని నగర అధ్యక్షుడు చెబుతున్నారు.

న్యాయవాదులకు 'మధ్యవర్తిత్వం'పై శిక్షణ



మాట్లాడుతున్న రీసోర్స్‌పర్సన్ బీనా దేవరాజ్

కడప అర్బన్ : కడపలోని న్యాయసేవాసదన్‌లో న్యాయవాదులకు 'మధ్యవర్తిత్వం'పై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ, మీడియేషన్ కన్సిలేషన్ ప్రాజెక్ట్ కమిటీ ఆదేశాలతో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జి చైర్మన్ ఎల్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ ఎస్.ప్రవీణ్‌కుమార్ సూచనల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా రీసోర్స్‌పర్సన్‌లు కర్ణాటక నుంచి వచ్చిన బీనా దేవరాజ్, తమిళనాడుకు చెందిన డాక్టర్ ఎస్.పద్మ మాట్లాడారు. మధ్యవర్తిత్వంపై న్యాయవాదుల పాత్ర, రాజీ నియమాలు, కమ్యూనికేషన్ నిర్వచనం, ప్రక్రియ ప్రభావంతమైన కమ్యూనికేషన్ ప్రయోజనాలపై వివరించారు. కమ్యూనికేషన్ రోల్‌ప్లే, స్కిల్స్, బాడీ లాంగ్వేజ్ సంబంధించి ప్రశ్నలు, నెగోషియేషన్‌పై చర్చలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ న్యాయవాదులు పాల్గొన్నారు.

'ఏపీజీబీ'ని కడపలోనే కొనసాగించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. మంగళవారం సేవ్ పబ్లిక్ సెక్టార్ ఆధ్వర్యంలో కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి అధ్యక్షతన యూటీఎఫ్ కార్యాలయంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ రైతులు, మధ్యతరగతి ఖాతాదారులకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. కరవు పీడిత, వెనుకబడిన ప్రాంతమైన కడపలో బ్యాంకు ఉనికి ప్రాంతీయ అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలో ఉన్న హైకోర్టు, లా యూనివర్సిటీ, ఎంఎస్ఎంఈ, గతంలో అనంతపురానికి రావాల్సిన ఎయిమ్స్ తదితరాలను తరలించి ఇక్కడి ప్రజలకు ఎంతో అన్యాయం చేశారని విమర్శించారు. రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు జానమద్ది విజయ భాస్కర్, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2006లో కడపలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయానికి 50 సెంట్ల స్థలాన్ని కేటాయించగా, 2015లో కడప నగరంలోని మరియాపురం వద్ద అన్ని సౌకర్యాలతో భవనాన్ని రూ.15 కోట్లతో నిర్మించారన్నారు. ఈ విషయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని, విలీనం తరువాత ఏర్పడే రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సదస్సులో వివిధ సంఘాల నాయకులు రాజశేఖర్ రాహుల్ (జేవీవీ), అవధానం శ్రీనివాస్ (ఇన్సూరెన్స్), సుబ్బారెడ్డి (పోస్టల్), సుధాకర్ (టెలికాం), శివశంకర్ (విద్యుత్), రామకృష్ణారెడ్డి (పెన్షనర్స్), ఏపీజీబీ యూనియన్ నాయకులు హనుమంతరెడ్డి, మహమ్మద్, శ్రీనివాసరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి లారీల అద్దాలు ధ్వంసం

పగలగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



పగిలిపోయిన అద్దాలు

ఎర్రగుంట్ల : మండలంలోని కలమల్ల గ్రామ పరిధిలో ఉన్న డాక్టరు ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు వద్ద నిలిపిన.. జేసీ ప్రభాకర్‌రెడ్డికి చెందిన లారీల అద్దాలను గుర్తు తెలియని దుండగులు పగలగొట్టిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గత కొన్ని రోజుల నుంచి ఫ్లైయాష్ బూడిదపై తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మధ్య వివాదం నడుస్తోంది. ఫ్లైయాష్ బూడిద తీసుకొని పోవడానికి కొన్ని రోజుల కిందట జేసీ ప్రభాకర్‌రెడ్డికి చెందిన ఆరు లారీలు ఆర్టీపీపీకి వచ్చాయి. అయితే బూడిదను ఆ లారీలకు లోడింగ్ చేయనీయబోమని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అనుచరులు పట్టుబట్టారు. దీంతో వారి మధ్య వివాదం చినికి చినికి గాలి వానై పెద్దగా మారింది. చివరికి సీఎం చంద్రబాబు వద్దకు వెళ్లింది. అయినా సమస్య తెగలేదు. జేసీ ప్రభాకర్‌రెడ్డి లారీలు మాత్రం లోడింగ్‌తోనే పోతామని.. అక్కడే నిలిపి వేశారు. పోలీసులు బందోబస్తు కొనసాగిస్తున్నారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు లారీల అద్దాలు పగలగొట్టడంతో.. మళ్లీ వివాదం ఏర్పడే అవకాశం లేకపోలేదు. ఈ విషయంపై కలమల్ల ఎస్ఐ తిమోతిని వివరణ కోరగా అలాంటిదేమీ లేదని, ఫిర్యాదు రాలేదని తెలిపారు.

సురక్షిత విధానాలతో ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ

కడప కార్పొరేషన్ : విద్యుత్ ప్రమాదాల నివారణకు సురక్షిత విధానాలు అనుసరించాలని ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ అన్నారు. భారత ప్రభుత్వ అధికార మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వారు 'కార్యాచరణ భద్రత, విపత్తు నిర్వహణ'పై విద్యుత్ సిబ్బందికి రెండు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఏదైనా విపత్తు సంభవించినప్పుడు ఎదుర్కోవడానికి తక్షణమే స్పందించి చర్యలు తీసుకునేలా సిబ్బంది సామర్థ్యాలను పెంపొందించడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యుత్ భద్రత విధానాలు, ప్రమాద నివారణ పద్ధతులు, అగ్ని ప్రమాదాలపై లోతైన అవగాహన అవసరమని పేర్కొన్నారు. అధిక శాతం ప్రమాదాలు విపత్తుల వల్ల సంభవిస్తున్నాయని, బాధితులకు సాయం చేయడానికి ప్రథమ చికిత్స పద్ధతులు తెలుసుకోవాలన్నారు. వరదలు, తుపానులు వచ్చినప్పుడు ఎదుర్కోవడానికి సంసిద్ధత గురించి శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ దుర్గాప్రసాద్, యన్‌పీటీఐ డైరెక్టర్ కె.ముత్తుకుమార్, డీఈఈ క్రిష్ణదేవ, సిబ్బంది పాల్గొన్నారు.

'ఏపీపీఎస్సీ' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు





కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి యం.విశ్వేశ్వర నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షలపై డీఆర్వో ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారులైన పర్యవేక్షకులు జి.అశోక్ (అసిస్టెంట్ సెక్రటరీ, మానిటర్), యస్.కె. కాశింవల్లి (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్)తో కలిసి పరీక్షల విధులు కేటాయించిన లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పరీక్షలు ఈ నెల 18 నుంచి 23 వరకు రెండు సెషన్లలో ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా చూడాలని సూచించారు. పోలీసు శాఖ ప్రతి సెంటర్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు, వారి వెంట వచ్చే వారికి ఎలాంటి కొరత లేకుండా ఆయా పరీక్ష కేంద్రాల యాజమాన్యాలు అన్ని వసతులు ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని కడప నగర పరిధిలో 1, చింతకొమ్మదిన్నె మండలంలో 3, ప్రొద్దుటూరు మండల పరిధిలో 1 పరీక్షా కేంద్రలతో కలిపి మొత్తం 5 కేంద్రాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు, లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడిగా రవీంద్రారెడ్డి



అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న రెడ్యం రవీంద్రారెడ్డి

ఖాజీపేట : కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ– 13 అధ్యక్షుడిగా రెడ్యం రవీంద్రారెడ్డి ఎంపికయ్యారు. ఖాజీపేట మండల పరిధిలో 9 నీటి సంఘాలు ఉన్నాయి. ఎన్నికలు పూర్తి అయిన తరువాత నీటి సంఘం అధ్యక్షులు అందరూ కలిసి మంగళవారం చెన్నముక్కపల్లె నీటి సంఘం అధ్యక్షుడిని డిస్ట్రీబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయనకు అధికారులు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఉపాధ్యక్షుడిగా పత్తూరు నీటి సంఘం అధ్యక్షుడు నంద్యాల సుబ్బయ్యను ఎన్నుకున్నారు.

కోడిపందెం ఆటగాళ్ల అరెస్ట్

మదనపల్లె : పట్టణంలోని వీవర్స్ కాలనీ వద్ద కోడి పందెం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,840 స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు..


వాణిజ్య పన్నుల శాఖ అధికారుల తనిఖీలు



బంగారు దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పలు దుకాణాల్లో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మదనపల్లె నుంచి వచ్చిన అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి బంగారు, వస్త్ర దుకాణాలతోపాటు వివిధ వర్గాల వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ప్రొద్దుటూరుకు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఆయా దుకాణాల్లోని రికార్డులను పరిశీలించి, లోపాలు ఉన్నట్లు తేలితే జరిమానా విధిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ తనిఖీలు జరుగుతున్నాయని తెలిపారు. తనిఖీల విషయం తెలియడంతో బంగారు వ్యాపారులు దుకాణాలను మూసేశారు.

ఉత్తమ పరిశోధక పత్రంగా ఎంపిక



గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న ధీరజ్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం మనోవిజ్ఞానశాస్త్రశాఖ పూర్వ పరిశోధక విద్యార్థి డాక్టర్ బి.వి.కె.ధీరజ్ అంతర్జాతీయ సదస్సులో ప్రశంసలు అందుకున్నారు. ఈ నెల 13 నుంచి 15 వరకు న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో 'ఆంధ్రప్రదేశ్‌లోని వృద్ధులలో అభిజ్ఞా పనితీరుపై సామాజిక–జనాభా చరరాశుల పాత్ర' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ధీరజ్ పరిశోధన పత్రాన్ని సోషియో సైకలాజికల్ రంగంలో ఉత్తమమైనదిగా ఎంపిక చేసి శ్రీవెంకటేశ్వర అవార్డును అసోసియేషన్ ఆఫ్ జెరోంటాలజీ, ఇండియా అందజేసింది. అతనికి వైవీయూ సైకాలజీ శాఖ అధ్యాపకురాలు డాక్టర్. కె.లలిత మార్గదర్శకత్వం అందించారు.

పెన్షనర్ల ఆశాజ్యోతి 'నకారా'



మాట్లాడుతున్న కడప జిల్లా ట్రెజరీ అధికారి వెంకటేశ్వరావు



సమావేశంలో పాల్గొన్న పెన్షనర్లు

కడప ఎడ్యుకేషన్ : పెన్షనర్ల పాలిట ఆశాజ్యోతి నకారా గారి అవిరళ అని కడప జిల్లా ట్రెజరీ అధికారి వెంకటేశ్వరావు అన్నారు. మంగళవారం కడప జిల్లా ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని పాత రిమ్స్‌లోని బీసీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నకారా కృషి ఫలితమే నేడు విశ్రాంత ఉద్యోగులు పొందుతున్న పింఛన్ విధానమన్నారు. ఆయనను ప్రతి ఒక్క పెన్షనర్ గుర్తుంచుకోవాలన్నారు. ఉప ఖజానా అధికారి రవికుమార్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు జాతి నిర్మాణ సారథులని, వారి అనుభవం అపారమైనదని అన్నారు. వారి సూచనలు ఆచరిస్తే ఏ దేశమైనా అభివృద్ధి పథంలో రాణిస్తుందన్నారు. కడప జిల్లాలోని పెన్షనర్స్‌కు ఎలాంటి సమస్యలు లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, వికలాంగుల, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ కడప పెన్షనర్స్ అసోసియేషన్ చేస్తున్న కృషి అమోఘమన్నారు. వారి న్యాయమైన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తమ వంతు సహకారం అందిస్తుందని తెలిపారు. జిల్లా ఎన్‌జీఓల సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, పెన్షనర్స్ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మాట్లాడుతూ 1982 డిసెంబర్ 17న జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన తీర్పు వల్ల నేడు విశ్రాంత ఉద్యోగులు సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి రామమూర్తి నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాల ఎల్లారెడ్డి జాతీయ పెన్షనర్ల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. 30 ఏళ్లుగా సంఘ అభివృద్ధి, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, రాధాకృష్ణ, నగేష్, నారాయణ తెలిపారు. అనంతరం 75 ఏళ్లు పూర్తి చేసుకున్న 46 మంది పెన్షనర్స్ ను సన్మానించారు. అనంతరం ముద్ర డ్యాన్స్ స్కూల్ చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు గానుగపెంట హనుమంతరావు, యోగా మాస్టర్ చలపతి గౌడ్, నారాయణ, సుబ్బారెడ్డి, నాగయ్య, మల్లయ్య, దేవరాజ్, సుభాన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మస్తాన్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.